# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

2. **గుంటూరు ఛానల్ కాలువ ఆధునీకరణ, విస్తరణ పనులకు అనుమతులు మంజూరయ్యాయని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2026 ఫలితాలు ఈ రోజు విడుదలైయ్యాయి.**

4. **రాష్ట్రంలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.**

5. **భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలధార - జలహారతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు.**

=========================

దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026 జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు అందులో పేర్కొంది. గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లను విశాఖ జోన్ పరిధిలోకి తీసుకొచ్చింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటనపై రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు కావడం రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమని పేర్కొన్నారు. రైల్వే జోన్ కార్యకలాపాలతో రాష్ట్ర రవాణా రంగంలో కొత్త దశ ప్రారంభమవుతుందని అన్నారు. కొత్త జోన్ ఏర్పాటుతో రైల్వే మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు కొత్త రైళ్లు, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

-------------------------

గుంటూరు ఛానల్ కాలువ ఆధునీకరణ, విస్తరణ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరైనట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, గుంటూరు ఛానల్ అభివృద్ధి ద్వారా సాగునీటి సరఫరా

వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నామని చెప్పారు. చానల్‌ను పరిశీలించామని ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన మరమ్మతు పనులను చేపడతామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఆధునీకరణ ద్వారా సాగు, తాగునీరు మరింత అందుబాటులోకి వస్తుందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2026 ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను విడుదల చేశారు. పాలిసెట్‌కు మొత్తం లక్షా 77 వేల 581 మంది దరఖాస్తు చేయగా.. లక్షా 63 వేల 8 మంది పరీక్ష రాశారు. వీరిలో లక్షా 48 వేల 950 మంది అర్హత సాధించారని తెలిపారు. పాలిసెట్‌లో బాలికలు 93.57 శాతం మంది అర్హత పొందగా.. బాలురులో 89.88 శాతం అర్హత సాధించారన్నారు. ఈ ఫలితాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 99.11 శాతం అర్హత సాధించగా.. 95.46 శాతంతో పోలవరం, 93.45 శాతంతో పార్వతీపురంమన్యం జిల్లాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయని చెప్పారు. ఫలితాలను polycetap.ap.gov.in వెబ్ సైట్ ద్వారా లేదా మన మిత్ర వాట్సప్ నంబరు 95523 00009 ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో “సురక్షిత రోడ్లు – సురక్షిత జీవితం” నినాదంతో నిర్వహించిన బైక్ అవగాహన ర్యాలీలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేశామని తెలిపారు. రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని మంత్రి సూచించారు.

---------------------------

సమాచార హక్కు చట్టం-RTI పై విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో కార్యాలయంలో రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సును ఈ రోజు నిర్వహించారు. ఈ సదస్సులో సమాచార హక్కు చట్టం అమలు, పారదర్శకత, ప్రజలకు అందించే సమాచారం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన సమాచార కమిషనర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంస్థలు ప్రజలకు సమయానికి సరైన సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.

---------------------------

మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఈరోజు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. నగరంలోని భవానీపురంలో జరిగిన ఈ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పివియన్ మాధవ్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పివియన్ మాధవ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పార్టీ బలపడుతోందని

పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో సాధించిన విజయాలు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా జలధార – జలహారతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, జలధార – జలహారతి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని హనుమంత గుండం చెరువు నుంచి దాదాపు 23 కిలోమీటర్ల కాలువ పరిధిలో ఉన్న ఐదు చెరువులు, వాగులు, వంకల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టినట్లు వెల్లడించారు. భూగర్భ జలాలు మూడు మీటర్ల లోపే అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీంతో రైతులు బోర్ల ద్వారా సులభంగా పంటలుసాగు చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా నీటి వనరుల సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం –ఆస్తమా పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మే నెల మొదటి మంగళవారం ప్రపంచ ఉబ్బస అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు.. ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, పెద్దలలో ఉబ్బసం అత్యంత తరచుగా వచ్చే దీర్ఘకాలిక వ్యాధి. గుర్తించింది. ఆస్తమాపై అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ–డబ్ల్యూహెచ్ఐ ఏటా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. “ఆస్తమా ఉన్నప్రతి ఒక్కరికీ యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ ఇన్‌హేలర్ అందుబాటులో ఉండటం – ఇప్పటికీ అత్యవసరం” అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ ఉబ్బస అవగాహన దినాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ఉబ్బసం – ఆస్తమాపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, వైద్య సేవల అందుబాటును మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, ఆస్తమాతో జీవిస్తున్న వారికి సమయానుకూల చికిత్సతో పాటు అవసరమైన మద్దతు అందించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన పరిసరాలు, సకాలంలో చికిత్స అత్యవసరమని మంత్రి అన్నారు.ఆస్తమా నియంత్రణకు జీవనశైలిలో మార్పులు అవసరమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విమాన ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ ఏడాది ఎంపికైన విద్యార్థులతో ఈరోజు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

====================